క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వితరణ



నగదు అందజేస్తున్న దృశ్యం

కోవూరు(విడవలూరు): మండలంలోని వెంకటరెడ్డిపాళెం గ్రామదేవత బంగారమ్మ ఆలయ నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రూ.50 వేల సొంత నిధులను అందజేశారు. ఆ నగదును కోవూరు మాజీ ఏఎంసీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి ఆలయ నిర్వాహకులకు గ్రామంలో శుక్రవారం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల పోలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు శ్రీనివాసులు, వెంకటరెడ్డిపాళెం కాపులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలోని రవీంద్రపట్టపుపాళెంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై జంపాని కుమార్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.32,390 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదుకుంటాం : ఏఎస్పీ



చెక్కును అందజేస్తున్న ఏఎస్పీ

నెల్లూరు(క్రైమ్): పోలీసు కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని ఏఎస్పీ డి.హిమవతి పేర్కొన్నారు. అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌లో పి.కరిముల్లా హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందగా ఆయన భార్య రెహానాకు శుక్రవారం ఆమె తన చాంబర్‌లో అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్కును అందజేశారు. వెంకటాచల సత్రం పోలీస్‌స్టేషన్‌లో పి.రాము కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మృతిచెందగా ఆయన భార్య సుధారాణికి రూ.లక్ష అడిషనల్ కార్పస్ ఫండ్, రూ.50 వేల విడో ఫండ్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సదుపాయాలు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శిరీష, హెచ్1 జూనియర్ అసిస్టెంట్ ఎస్‌వీ అంజనీకుమార్, మృతుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

6న కళాకారులకు పురస్కారాలు

నెల్లూరు(బృందావనం): జిల్లాలో కళారంగాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్న వివిధ రంగాలకు చెందిన 'కళాకారులకు అవార్డులు' ఇవ్వనున్నట్లు కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. నగరంలోని పురమందిరం ప్రాంగణంలో శుక్రవారం కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 6వ తేదీన పురమందిరంలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పలువురు కళాకారులు పురస్కారాలను అందుకోనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సంగీత, నృత్య పోటీల్లో పాల్గొనే చిన్నారులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులతోపాటు అవార్డులు అందజేసి సత్కరించనున్నామన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో 50 మంది చిన్నారులతో నృత్య ప్రదర్శనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, శ్రీబాలాజీ ఆర్కెస్ట్రాచే సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎ.రాయప, ఎన్వీ రమణయ్య, ఎం.మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో అపూర్వ స్పందన



పొదుపు సంఘాల సభ్యులకు మెగా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- మహిళలు ఆర్థికంగా ఎదగాలి
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలను అపూర్వ స్పందన వస్తోంది. సంక్షేమ పథకాలతో మేలు జరిగిందని సంతోషంగా చెబుతున్నారు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోవూరు సచివాలయం–1 పరిధిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఈ ఏడాది రూ.7 కోట్లను రుణంగా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో 152 పొదుపు సంఘాలకు రూ.3.13 కోట్ల రుణాలివ్వడం జరిగిందన్నారు. కోవూరు సచివాలయం–1 పరిధిలో 78 మందికి రూ.39 లక్షలను పంపిణీ చేశారన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి ఏడాది అయ్యిందన్నారు. 78 సచివాలయాల పరిధిలో మొత్తం 90,342 గడపలు పూర్తి చేశామన్నారు. ఇది ఒక చరిత్ర అన్నారు. ప్రభుత్వం నుంచి ఏమి లబ్ధి చేకూరిందో ప్రజలు చెబుతున్నారన్నారు. ఊహించిన దానికంటే అధిక మేలు జరిగిందన్నారు. ఈ విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. గతంలో ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించాలంటే ఎన్నో కష్టాలు పడేవారన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తమ ప్రభుత్వం మార్చినట్లు తెలిపారు. విద్యార్థుల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

నవరత్నాలతో మేలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా ప్రజలకు ఎంతోమేలు జరిగిందని ప్రసన్న తెలిపారు. గ్రామాలకు వెళ్లిన సమయంలో ప్రజలు సమస్యలు చెబుతున్నారని, వాటిని వీలైనంత త్వరగా అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కాలువలు, సీసీ రోడ్లు, వీధిలైట్ల గురించి అడిగిన వెంటనే సంబంధిత అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయించడం, త్వరగా ఆ పనులను పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలను ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో పనులు చేయిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టి విజయవంతంగా పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నర్సింహులురెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, స్థానిక ఎంపీటీసీ జోత్స్న, శ్రీధర్, చిరంజీవి, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఏపీఎల్‌డీఏ, డీసీఎంఎస్ చైర్మన్లు, అధికారులు

- ఏపీఎల్‌డీఏ, డీసీఎంఎస్ చైర్మన్లు

కొడవలూరు: 'పాడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంది. వారు ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందిస్తోంది.' అని ఏపీఎల్‌డీఏ, డీసీఎంఎస్ చైర్మన్లు గొల్లపల్లి విజయకుమార్, వీరి చలపతిరావు అన్నారు. మండలంలోని యల్లాయపాళెంలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిని వారు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ రాయితీపై పెయ్య దూడల వీర్య నాళికలను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కృత్రిమ గర్భాధారణకు పెయ్య దూడలు పుట్టేలా రెండు ఇంజెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. రెండింటి విలువ రూ.1,350లు కాగా, పాడి రైతులకు రాయితీపై రూ.500కే ఇస్తున్నట్లు చెప్పారు. ఇంజెక్షన్ల ద్వారా గర్భం దాల్చకపోతే రైతులు చెల్లించిన రూ.500ను తిరిగి వారికి ఇచ్చేయడం జరుగుతుందని చెప్పారు. కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పాడి పశువులను ఉత్పత్తి చేసి రైతులను లాభాల బాటలో నడిపించాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. రోజుకు 20 లీటర్ల పాలు ఇచ్చే మేలు జాతి పశువులను ఉత్పత్తి చేయడం వల్ల రైతులు బాగా లాభ పడతారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని చెప్పారు. కృత్రిమ గర్భధారణకు అవకాశం లేని గ్రామాల్లో రూ.20 వేల విలువ చేసే ఒంగోలు ఆబోతు జాతి పెయ్య దూడను ఉచితంగా ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పెయ్య దూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం సమగ్రంగా వివరించి వాటిని సంరక్షించుకోవడంలో పశు సంవర్ధక శాఖ అధికారులు ఎంతగానో సహాయ సహకారాలందిస్తున్నారన్నారు.

చర్యలు తీసుకుంది

పాడి పశువులకు ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే 1962 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా పశువుల అంబులెన్స్‌ను వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చైర్మన్లు వివరించారు. అనంతరం మేలుజాతి నల్ల తెల్ల పశువులను ప్రదర్శించిన రైతులకు బహుమతులు, ఇంకా పశువుల డీవార్మింగ్ మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ బి.మహేశ్వరుడు, డీడీలు ప్రజన్నాంజనేయులు, తిరుమలేష్, హర్షవర్ధన్‌రెడ్డి, ఏడీలు టి.సోమయ్య, రమేష్ నాయక్, పశువైద్యాధికారి జ్యోతి సురేష్ బాబు, విజయ డెయిరీ, డీఎల్‌డీఏ డైరెక్టర్‌లు ఇసనాక సునీల్‌రెడ్డి, మందపల్లి మల్లికార్జున, ఎంపీటీసీ కె.వెంకటరమణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ జడ్డా అమరావతి, నాయకులు తాటిపర్తి భాస్కర్, ఎస్‌కే మాబాషా పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని తీర్మానం



సమావేశమైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ముత్తుకూరు: ముత్తుకూరులో మూడుచోట్ల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించాలని పంచాయతీ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. శుక్రవారం సర్పంచ్ బూదూరు లక్ష్మి అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో సమావేశం జరిగింది. వివిధ చోట్ల సుమారు రూ.25 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కొందరు భవనాలు నిర్మించారని ఇందులో చర్చించారు. వీటిని తొలగించాలని తీర్మానం చేశారు. చర్చకు వచ్చిన మరో 21 అంశాలను ఆమోదించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.అనితారెడ్డి, పంచాయతీ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి సభకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

ముత్తుకూరు: ముత్తుకూరులో రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు సంబంధించి వేదిక ఏర్పాటు చేసే నిమిత్తం శుక్రవారం స్థల పరిశీలన చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు లక్ష్మణరెడ్డి, ముత్యంగౌడ్ తదితరులు బజారు సెంటర్‌లో స్థలాన్ని పరిశీలించారు. ఈనెల 6వ తేదీ సాయంత్రం సభ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.

సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలి



డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న డీడీ నాగమణి

ఇందుకూరుపేట: మూగజీవాలకు సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలని పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ ఎం.నాగమణి అన్నారు. మండలంలోని ప్రాంతీయ వైద్యశాలలో శుక్రవారం ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు మండలాల పరిధిలోని ఆ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి ఎస్‌ఎల్‌ఎం ప్రాజెక్ట్ కింద చేపట్టిన వివిధ రకాల స్కీమ్స్‌పై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను నూరుశాతం అధిగమించాలన్నారు. ఏహెచ్ సహాయకులకు డిక్లరేషన్ సర్టిఫికెట్లను డీడీ అందజేశారు. కార్యక్రమంలో ఏడీలు మురళీకృష్ణ, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. నెల్లూరులోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 200 మంది పాల్గొన్నారు. వారందరికీ ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించడంతోపాటు మందులు అందజేశారు. సుమారు 60 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దాతలు హరిప్రసాద్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ రమణమ్మ, స్థానికులు శివరామకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మస్తానయ్య పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



పొదలకూరు: మండలంలోని మరుపూరు సచివాలయం పరిధిలో బుధవారం గుడి రామ్మోహన్ అనే వ్యక్తి మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి తక్షణ సాయం రామ్మోహన్ సతీమణి గుడి మాధవికి శుక్రవారం వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నాగయ్య రూ.10 వేలు అందజేశారు. మిగిలిన నగదును త్వరలో అందజేస్తామని సచివాలయ ఉద్యోగులు వెల్లడించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఐ.విజేత, సెక్రటరీ కిశోర్, వలంటీర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో సదస్సులు

వెంకటాచలం: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం నుంచి ఎన్నికల అంశాలపై అక్షరాస్యత, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తహసీల్దార్ పి.కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పాలిచెర్లపాడు, చెముడుగుంట, అనికేపల్లి, ఇడిమేపల్లి, ఇస్కపాళెం గ్రామాల్లో, 8వ తేదీన చింతలపాళెం హరిజనవాడ, చవటపాళెం, కుంకుంపూడి, తిక్కవరప్పాడు, ఈదగాలి, నిడిగుంటపాళెం, 9న కసుమూరు, వెంకటాచలం, కాకుటూరు, జోసఫ్‌పేట, పూడిపర్తి, పుంజులూరుపాడు, గుడ్లూరువారిపాళెం, 10న కసుమూరు, కనుపూరు బిట్–1, కంటేపల్లి, సర్వేపల్లి, ఎగువమిట్ట, తిరుమలమ్మపాళెం, 11న తాటిపర్తిపాళెం, మంగళగుంట, కందలపాడు, గొలగమూడి, రామదాసుకండ్రిగ, 12, 16 తేదీల్లో కురిచెర్లపాడు, 17న ఇస్లాంపేట గ్రామాల్లో సదస్సులు జరుగుతాయన్నారు. ఓటింగ్, ఇతర ఎన్నికల అంశాలపై అవగాహన పొందేందుకు ప్రజలు పాల్గొనాలని కోరారు.

'సంపూర్ణ పోషణ'తో రక్తహీనతకు చెక్

- పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయకుమార్



కిట్ అందజేస్తున్న విజయకుమార్

కొడవలూరు: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం టేక్ హోమ్ రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ తెలిపారు. మండలంలోని యల్లాయపాళెం రెడ్డిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆయన సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యకరంగా లేకపోతే ప్రసవ సమయంలో సమస్యలు ఎదుర్కోవడంతోపాటు ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనివ్వలేరన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని సంపూర్ణ పోషణ కిట్లను ఇళ్లకే ఇచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. బియ్యంతోపాటు కంది పప్పు, గుడ్లు తదితరాలు కిట్లలో ఉంటాయన్నారు. ఇంటికే సంపూర్ణ పోషణ అందించేలా చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ, విజయ డెయిరీ డైరెక్టర్లు మందపల్లి మల్లికార్జున, ఇసనాక సునీల్‌రెడ్డి, సీడీపీఓ పి.జ్యోతి, ఏసీడీపీఓ ఎస్.అరుణ, సూపర్‌వైజర్ వి.పద్మావతి, నాయకులు తాటిపర్తి భాస్కర్, ఎస్‌కే మాబాషా, అంగన్‌వాడీ కార్యకర్తలు రాధ, సుఖవేణి, కవిత, జ్యోష్న, నీరజ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



ముత్తుకూరు: పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

ముత్తుకూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ఆవిష్కరించారు. తొలుత జరిగిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ ఈనెల 10, 17 తేదీల్లో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మండలంలో అర్హులైన చిన్నపిల్లలు 14,956 మంది ఉన్నారని, వారి ప్రభుత్వం 16,400 మాత్రలు సరఫరా చేసిందన్నారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను ఏఎన్‌ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రత్యూష, మండల వైద్యాధికారి అనూష, ఎంఈఓ మధుసూదన, డాక్టర్ శ్రీదేవి, పీహెచ్‌సీ పీహెచ్‌ఎన్ వేలాంగణి, సూపర్‌వైజర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.



కొడవలూరు: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

- **కొడవలూరు:** ఈనెల 10న జరిగే జాతీయ డీ వార్మింగ్ డేను విజయవంతం చేసేందుకు సమైక్యంగా కృషి చేద్దామని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 12 వేల మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ, ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, సీహెచ్‌ఓ సోమశేఖర్, విజయమ్మ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

వెంకటాచలం: ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి మంగళవారం ఉదయం 11 గంటలకు నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి పి.కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీల ప్రతినిధులు హాజరై, తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలన్నారు.

మోటార్‌బైక్ అపహరణ

నెల్లూరు(క్రైమ్): మోటార్‌బైక్ అపహరణ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. ఉమ్మారెడ్డిగుంట, పెద్దబావిసెంటర్‌కు చెందిన మురళి గత నెల 20వ తేదీన రాత్రి రోజూలాగే తన డియో డ్రీమ్ బైక్‌ను తన ఇంటి ముందు నిలిపి నిద్రపోయాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు వేదాయపాళెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. వారు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): అదనపుకట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన ఘటనలో భర్త, అత్తింటివారిపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. బీవీనగర్‌కు చెందిన సునీత అలియాస్ పావనికి తిరుపతి జిల్లా కోట మండలం మద్దాలికి చెందిన హరికృష్ణతో 2019లో వివాహమైంది. ఈ సమయంలో రూ.3 లక్షల నగదు, పన్నెండున్నర సవర్ల బంగారు ఆభరణాలను సునీత కుటుంబసభ్యులు కట్నకానుకుల కింద ఇచ్చారు. వివాహానంతరం సునీత, హరికృష్ణ మద్దాలిలో కాపురం పెట్టారు. కొద్దిరోజులు వారి కాపురం సజావుగా సాగింది. మద్యానికి బానిసైన భర్త ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. అత్తమామలు అతడికి వత్తాసు పలకడంతో సునీత పరిస్థితి దయనీయంగా మారింది. అదనపుకట్నం కోసం భర్త, అత్తింటి వారు ఆమెను చిత్రహింసలకు గురిచేయసాగారు. వారి వేధింపులు తాళలేక బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదోన్నతి జాబితాలో అడ్మిన్ ఏఎస్పీ హిమవతి

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర ప్రభుత్వం ఏఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి కల్పించేందుకు ప్యానల్ జాబితాను శుక్రవారం విడుదల చేసింది. అందులో నెల్లూరు జిల్లా అడ్మిన్ ఏఎస్పీ డి.హిమవతి ఉన్నారు. ఈమె గతేడాది మేలో ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. కొద్దినెలలుగా సెబ్ అధికారిణిగా సైతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. త్వరలో ఆమెకు పదోన్నతి లభించనుంది.

అంగన్‌వాడీల్లో తల్లిపాల వారోత్సవాలు



ఇందుకూరుపేట: వారోత్సవాల్లో పాల్గొన్న పీడీ



బుచ్చిరెడ్డిపాళెం: మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి



పొదలకూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్



మనుబోలులో..

ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేటలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఇందులో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ పాల్గొని మాట్లాడారు. తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. ఈనెల 7వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం టేక్ హోం రేషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ రాజేశ్వరి, సూపర్‌వైజర్లు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- **బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు సీడీపీఓ జ్యోతి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలను పట్టించాలని కోరారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, కౌన్సిలర్ మోర్ల జయంతి, ఏసీడీపీఓ అరుణ, సూపర్‌వైజర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.
- **పొదలకూరు:** తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పులికల్లు, కనుపర్తి అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే ముర్రుపాలు తాగించాల్సిందిగా సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.
- **మనుబోలు:** తల్లిపాలే బిడ్డకు ఔషధమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ రమణమ్మ అన్నారు. మనుబోలు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మమ్మ, మహిళా పోలీస్ శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.